గత ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తాం: కొండా సురేఖ



చెక్కు అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు

చేర్యాల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం చివరి ఏడాది చెల్లించాల్సిన పలు సంక్షేమ పథకాలు, అనేక అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల బిల్లుల బకాయిలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇస్తున్నట్లు, అందుకే కొందరి కూతుళ్లకి పెళ్లి అయిపోయి, తాతలు, అమ్మమ్మలు అయ్యాక ఈ చెక్కులు ఇవ్వాల్సి వస్తోందని దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. స్థానికంగా ఓ వేడుక మందిరంలో జనగామ ఎమ్మెల్యే పి.రాజేశ్వర్‌రెడ్డితో కలిసి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూల్మిట్ట మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల సూచనలు పరిగణనలోకి తీసుకొని సమాజానికి మంచి జరుగుతుందంటే వాటిని అమలు చేస్తామన్నారు. మొత్తం 242 మందికి రూ.2.48 కోట్ల విలువైన చెక్కులు అందించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, శభాష్‌గూడెం వరకు రెండు వరసల రహదారి నిర్మాణం, కోర్టును త్వరలో ప్రారంభించి, కావాల్సిన పోస్టుల మంజూరు చేయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో భారాస, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేశారు. మంత్రి, ఎమ్మెల్యే తమ పార్టీల నాయకులు, కార్యకర్తలకు సూచనలిచ్చి సద్దుమణిగేలా చేశారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా భారాస నాయకులు 'తులం బంగారం ఎప్పుడిస్తారు..' అని ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్, భారాస శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అడ్డుకున్నారు. అదనపు సీపీ మల్లారెడ్డి నేతృత్వంలో 19 మంది పోలీసు అధికారులు, 200 మంది పోలీసుల భారీ బందోబస్తు మధ్య కార్యక్రమం జరిగింది. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో సదానందం, పురాధ్యక్షురాలు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



నంగునూరు ధర్నాలో పాల్గొన్న రైతులు

'నాడు భూముల విలువలు పెరిగాయి.. నేడు తగ్గాయి'

నంగునూరు, సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కరోనా కష్ట సమయంలో రాష్ట్రానికి ఎలాంటి ఆదాయం లేకున్నా రైతుబంధు పథకాన్ని కేసీఆర్ అందించారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో భూముల విలువలు పెరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తగ్గాయన్నారు. నంగునూరులో రుణమాఫీ దక్కని రైతుల ధర్నాలో హరీశ్‌రావు శుక్రవారం పాల్గొని మాట్లాడారు. గట్లమల్యాలకు బుద్ధి వెంకవ్వ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో రూ.1.70 లక్షల రుణం మాఫీ కాలేదని తెలిపారు. గ్రామీణ వికాస బ్యాంకులో రూ.58 వేలు మాఫీ కాకపోవడంతో బయట అప్పు చేశానని నంగునూరులోని చింతల దుర్గారెడ్డి చెప్పారు. నంగునూరులో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మాజీ మంత్రి ఆవిష్కరించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను కొనియాడారు. ఆయన చరిత్రను పాఠ్యాంశంలో చేర్చడానికి అసెంబ్లీలో మాట్లాడతానన్నారు. సిద్దిపేటలో జయంతిని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి హరీశ్‌రావు, అధికారులు, నాయకులు నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పురపాలిక అధ్యక్షురాలు మంజుల, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగత్‌కుమార్‌రెడ్డి, భారాస కార్యదర్శి రాధాకృష్ణశర్మ, పద్మశాలి సంఘం ప్రతినిధులు సతీశ్, మల్లేశం పాల్గొన్నారు.



సిద్దిపేట: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న హరీశ్‌రావు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, బల్దియా అధ్యక్షురాలు మంజుల

ప్రేమించానని మోసం.. కేసు నమోదు

తొగుట: తొగుటకు చెందిన సిలివేరి నరేశ్‌గౌడ్ తనను ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి నిరాకరించి మోసగించాడంటూ యువతి (25) ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికాంతరావు తెలిపారు. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన యువతిని నరేశ్ మూడేళ్ల నుంచి ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని ఆరు తులాల బంగారం, రూ.2.30 లక్షలు తీసుకున్నాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ చేసినా ససేమిరా అనడంతో ఆమె శుక్రవారం ఫిర్యాదు చేశారు.

ఈ నీరు తాగేదెలా?

వర్షాకాలం అంతా నీటి ట్యాంకులను, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి. జిల్లాలోని అనేక చోట్ల పాకురు పట్టి, మురుగు మధ్య ఉంటూ ప్రజలకు వ్యాధులు తెచ్చేలా ఉన్నాయి. వాటిని పద్ధతి ప్రకారం సమయానుకూలంగా శుభ్రం చేసి ఆరోగ్యం కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



రోగకారకాలు

న్యూస్‌టుడే, చేర్యాల: వర్షాకాలంలో నీటి కాలుష్యం ఎక్కువ. తాగితే రోగకారకం అవుతాయి. ప్రజల సంక్షేమం కోరుతూ అధికారులు, సిబ్బంది పట్టించుకుంటే ట్యాంకులు, నీరు స్వచ్ఛంగా ఉంటాయి. చేర్యాల వైశ్యభవన్ వద్ద శివాలయం గుడి ప్రహరీని ఆనుకొని ఉన్న ట్యాంకు, చావడి కూడలి సమీపంలో భగత్‌నగర్‌లోని మినీ ట్యాంకులు పాకురు పట్టాయి.

స్వచ్ఛంగా లేని పరిసరాలు

నంగునూరు: రాంపూర్ ప్రయాణ ప్రాంగణం సమీపంలో మినీ నీటి ట్యాంకు అపరిశుభ్రంగా మారింది. తరచూ నీరు వృథాగా పోతోంది. పరిసరాల్లో మురుగు నిలుస్తోంది.





శుద్ధికి భంగం.. ఇబ్బందికరం

దుబ్బాక: దుబ్బాక పురపాలికలోని మిషన్ భగీరథ పైపులు, ట్యాంకులు, గేట్‌వాల్వులు కొన్ని లీకేజీలతో శుద్ధి నీటికి భంగం కలిగిస్తున్నాయి. పట్టణంలోని 1వ వార్డు మారెమ్మ గడ్డ, రెండు పడక గదుల ఇళ్ల ప్రాంతంలోని పైపులు, ట్యాంకు, గేట్‌వాల్వుల వద్ద లీకేజీలతో పాకురు, మొక్కలు, మురుగుతో ఇబ్బందికరంగా ఉన్నాయి.

సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా శాంతి



సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.సి.శాంతి నియమితులయ్యారు. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన కిషోర్‌కుమార్ వరంగల్‌కు బదిలీ కాగా, ఇన్నాళ్లు ఆ స్థానంలో చిన్నపిల్లల వైద్య విభాగం అధిపతి సురేశ్‌బాబు కొనసాగారు. మానసిక వైద్య విభాగం అధిపతిగా వ్యవహరిస్తున్న శాంతికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.

రుణమాఫీలో బ్యాంకుల జాప్యం తగదు: కలెక్టర్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రుణమాఫీ పథకంలో పలు బ్యాంకులు ఆధార్‌లో తప్పుల సవరణ, ఇతర కారణాలతో జాప్యం చేస్తుండటంపై కలెక్టర్ మనుచౌదరి అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు మార్చుకోకుంటే ఫిర్యాదు చేస్తానన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాలోని వివిధ బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాదిలో ఎస్‌హెచ్‌జీలో రూ894 కోట్లకు గాను రూ.750 కోట్లు రుణాలు మంజూరయ్యాయన్నారు. పీఎం స్వనిధి, పీఎంవిశ్వకర్మ ప్రక్రియ సైతం వేగంగా పూర్తి చేయాలన్నారు. వర్గల్ మండలం తున్కిఖాల్సాలో యూబీఐ నూతన శాఖను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా ఫండ్‌లో రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో నిలిచినందుకు నాబార్డు అందించిన జ్ఞాపికను కలెక్టర్ చేతుల మీదుగా ఎల్డీఎం హరిబాబుకు అందజేశారు. ఆర్బీఐ ఏడీవో తాన్య, యూబీఐ హెడ్ వికాస్, ఏపీజీవీబీ ఆర్‌ఎం ఉదయ్‌కిరణ్, డీసీసీబీ డీజీఎం విశ్వేశ్వర్, టీజీబీఆర్‌ఎం బాలనాగు, నాబార్డు డీడీఎం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. వానకాలం ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 417 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మనుచౌదరి

తాగునీటి పైనే ప్రజారోగ్యం ఆధారం



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రమేశ్

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: గ్రామస్థులకు సురక్షిత నీటిని అందించడంతో పాటు వృథాను అరికట్టాలని.. తాగునీటి పైనే ప్రజారోగ్యం ఆధారపడి ఉందని జడ్పీ సీఈవో రమేశ్ మంచినీటి సరఫరా సహాయకులకు సూచించారు. చిన్నకోడూరు మండల పరిషత్తు కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్లు, ఇంటింటా నల్లా కనెక్షన్ల తీరు, గేట్ వాల్వ్‌లు, పైపులైన్ మరమ్మతులు, క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, డీఈఈ సుమలత, ఏఈఈ సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చదువుకోవే చెల్లెలా.. భవిష్యత్తు నీదెగా..

బాలికలు చదువుకుంటే సమాజానికి వెలుగు దివ్వెలవుతారనడంలో సందేహం లేదు. చదువుకోవాలనే ఇష్టం ఉండాలే కానీ విద్యార్థులకు ఇల్లా, పాఠశాలా, మార్కెట్టా, దుకాణమా, బస్టాండా.. అని చూడరు. జగదేవపూర్‌లో సమయం వృథా కాకుండా అభ్యాసం చేస్తున్న వీరు స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు. వీరు ధర్మారం గ్రామానికి బస్సులో వెళ్లాల్సి ఉంది. సాయంత్రం 4:15 గంటలకు బడి వదిలారు. ఆర్టీసీ బస్సు 5:30 గంటలకు వస్తుంది. ఈలోపు సమయం వృథా కాకుండా బస్టాండు ప్రాంతంలోనే ఇలా సాధన చేస్తుండటం చూపరులకు ముచ్చటగొలిపింది.

- న్యూస్‌టుడే, జగదేవపూర్



కొమురవెల్లి మల్లన్న సేవలో ఎస్‌బీఐ సీజీఎం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ కొమురవెల్లి మల్లికార్జునస్వామిని శుక్రవారం దర్శించుకొని పూజలు చేశారు. త్వరలో కొమురవెల్లిలో ఎస్‌బీఐ శాఖను ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎస్‌బీఐ డీజీఎం వివేక్‌చంద్ర జస్వాల్, రీజనల్ మేనేజర్ అరుణజ్యోతి, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సిద్దిపేట ప్రాంతీయ అధికారి నర్ర సంతోష్ ఉన్నారు. **– న్యూస్‌టుడే, చేర్యాల**



పర్యావరణ హితం.. వృత్తి నైపుణ్యం!



- విద్యార్థులకు ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణ

విద్యార్థి దశలోనే వృత్తి నైపుణ్యాలు పెంపొందిస్తూ.. పర్యావరణ హితం వైపు యోచించేలా జాతీయ హరిత దళం (ఎన్‌జీసీ) సంకల్పించింది. చిట్టి బుర్రలకు పదును పెట్టేలా.. కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్ఈడీ దీపాల తయారీ శిక్షణకు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా ఒక్కో జిల్లాకు పాఠశాలలను ఎంపిక చేసి తర్ఫీదు ఇస్తోంది. జిల్లా స్థాయిలో ఒక రోజు కార్యశాల చేపడుతోంది. సంగారెడ్డిలో 23, సిద్దిపేటలో 26 తేదీలలో నిర్వహించారు.

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సిద్దిపేట

200 పాఠశాలల్లో అమలు

జాతీయ హరితదళం ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణకు ఒక్క జిల్లాకు 50 చొప్పున 200 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో బడిలో సైన్స్ ఉపాధ్యాయుడు, ముగ్గురు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. ఎల్ఈడీ దీపం తయారీపై అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి సమన్వయకర్త రాజశేఖర్ ఆధ్వర్యంలో నిపుణులు విద్యార్థులకు వివరిస్తున్నారు. పిల్లలతో వాటిని రూపొందింపజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తయారు చేసిన బల్బులు పాఠశాల, ఇంటి వద్ద వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు.

అన్ని పాఠశాలల్లో..



ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ (ఏకో) క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (ఎల్ఐఎఫ్ఈ) థీమ్‌గా ఎంచుకొని ఏడు అంశాలను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎల్ఈడీ దీపాల తయారీపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

ఎల్ఈడీ ప్రయోజనాలు ఇలా..

- 90 శాతం విద్యుత్తు ఆదా.
- ఎక్కువ కాలం మన్నిక, దృఢంగా ఉంటాయి.
- ఉత్పత్తి చేసేందుకు తక్కువ ఖర్చవుతుంది.
- తయారీ ఖర్చు తక్కువ.
- ఉద్గారాలు తక్కువ శాతం వెలువడుతాయి.

వాడే వస్తువులు, తయారీ

బల్బు తయారీకి ఎల్ఈడీ స్ట్రీప్, బీసీబీ, ట్రాన్స్‌ఫార్మర్, రెసిస్టర్, దయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ను వాడుతారు. ముందుగా ఎల్ఈడీ స్ట్రీప్ పైభాగాన్ని తీసుకోవాలి. అందులో రెసిస్టర్, దయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సహాయంతో అన్ని భాగాలను బిగించాలి. 230 వాట్స్ ఉన్న విద్యుత్తును ఆటోమేటిక్‌గా 10 వాట్స్‌కు మార్చుకుంటుంది.

ఉత్సాహంగా నేర్చుకున్నా:



ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీని ఉత్సాహంగా నేర్చుకున్నా. అధికారులు చక్కగా అవగాహన కల్పించారు. నేను ఓ ట్యూబ్ లైట్ తయారుచేశా. కేవలం రూ.వంద ఖర్చయ్యింది. దాన్ని పాఠశాలలోని ఓ గదిలో వినియోగిస్తున్నాం.

సహస్ర, విద్యార్థిని ఎద్దుమైలారం

సత్ఫలితాలు:

జపాన్ వంటి దేశాల్లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తి తయారు చేసే కుటీర పరిశ్రమలెన్నో ఉన్నాయి. ఇందుకు దీటుగా భారత్ తయారు కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. నైపుణ్యం పెంపొందిస్తే ఉపాధి సులువుగా లభిస్తుంది. విద్యార్థి దశ నుంచే అలవర్చడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయి.

బేతి భాస్కర్, జిల్లా ఎన్‌జీసీ సమన్వయకర్త, సిద్దిపేట

గగనతలంలో శిక్షణ..
లక్ష్య సాధనకు తపన

న్యూస్‌టుడే, సిద్దిపేట, సిద్దిపేట టౌన్



నిరంజన్‌రెడ్డి

ఆసక్తి, ధైర్యానికి సాధన తోడైతే లక్ష్య సాధన పెద్ద కష్టమేమి కాదని నిరూపించారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నిరంజన్‌రెడ్డి. గగనతలంలో ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి చేశారు. బీకామ్ కంప్యూటర్స్ (తృతీయ) చదువుతున్న ఇతడి స్వస్థలం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి. తల్లిదండ్రులు లత, బ్రహ్మానందరెడ్డి. వ్యవసాయ కుటుంబం. ఆర్మీలో చేరాలనే తలంపుతో ప్రథమ సంవత్సరంలోనే ఎన్‌సీసీలో చేరారు.

త్రివిధ దళాల్లో కొలువే లక్ష్యంగా అడుగేసిన నిరంజన్‌రెడ్డి.. వాయుసేన ఆధ్వర్యంలో కొనసాగిన 23 రోజుల పారా బేసిక్ కోర్సు పూర్తి చేశారు. ఆగ్రాలో ఈ నెల 2 నుంచి 24 వరకు శిబిరం కొనసాగగా, కరీంనగర్ బెటాలియన్ నుంచి పాల్గొన్నది ఇతనొక్కడే కావడం విశేషం. పారా బేసిక్.. వాయుసేన విభాగంలో ప్రాథమిక స్థాయి శిక్షణ ఇచ్చే కోర్సు. దీనికి 175 మంది ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు 50 మంది పాల్గొన్నారు. శిక్షణను పూర్తి చేసుకొని ధ్రువపత్రం అందుకున్న కేడెట్‌ను వైస్ ప్రిన్సిపల్ డా. పి. అయోధ్యరెడ్డి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని, ఏవో సులేమాన్ అభినందించారు.

శిక్షణ సాగిందిలా..

తొలుత టేబుల్ (3 ఫీట్ల ఎత్తు) నుంచి దూకడం, నిల దొక్కుకునే తీరుపై మెలకువలు నేర్పించారు. కదిలే చక్రాలపై 9 అడుగుల ఎత్తు నుంచి దూకడం, తర్వాత 11 అడుగుల ఎత్తుపై నుంచి ప్యారాచూట్ ఆధారంగా దూకడం, గగనతల ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దూకే ముందు పాటించాల్సినవి నేర్పించారు. 12 రోజుల తర్వాత 30 అడుగుల ఎత్తు నుంచి దూకడాన్ని (ఫ్యాన్ టెస్టు) పరీక్షించారు. ఒకరోజు ఎరోప్లేన్‌లో 4 గంటలు ప్రయాణించారు. శిక్షణలో 15 రోజులు పూర్తయ్యాక రోప్లేన్ నుంచి నేరుగా దూకడం (1250 అడుగుల ఎత్తు) మొదలవుతుంది. 'ప్రారంభంలో కొంత భయమేసినా నిత్యం సాధనతో గొప్ప అనుభూతి కలిగింది. ఆర్మీలో ఉన్నత ఉద్యోగమే లక్ష్యమ'ని చెబుతున్నారు నిరంజన్‌రెడ్డి.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



సూచనలు చేస్తున్న రమేష్ సరియల్

పాపన్నపేట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందుతుందని 33(టీ) సంగారెడ్డి యూనిట్ ఆర్మీ కమాండింగ్ అధికారి రమేష్ సరియల్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సీసీ ధ్రువపత్రాలతో పోటీ పరీక్షల్లో మేలు కలుగుతుందని చెప్పారు. హెచ్ఎం మహేశ్వర్, సీటీవో ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోండి



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ రాములు తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీసీ నీరజా ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, ప్రముఖ రచయిత బి.ఎస్.రాములు ఆకాంక్షించారు. శుక్రవారం ములుగులోని కొండా ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు ఇప్పుడు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. దేశం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయం 8వ వార్షికోత్సవ నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, సురేష్‌కుమార్, సుచిత్ర, చీనా, ప్రశాంత్, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తే విజయం ఖాయం



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే సృజనాత్మక శైలిని అలవర్చుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ సూచించారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. 6 నుంచి 9 తరగతి వరకు విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభ చాటుకునేందుకు కళా ఉత్సవ్ పోటీలు చక్కటి వేదికన్నారు. శ్రమిస్తే విజయం ఖాయమని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. అనంతరం హవేలిఘనపూర్ శివారులోని డైట్ కళాశాలను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, సిబ్బంది గురించి డైట్ ప్రిన్సిపల్ రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మాధ్యమంలో 100 సీట్లు కేటాయించాలని, అధ్యాపకులను నియమించాలని మహ్మద్ రియాజుద్దీన్.. రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవోలు నీలకంఠం, మధుమోహన్, హెచ్ఎంలు కరుణాకర్, నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాప్‌లతో జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ బాబు

న్యూస్‌టుడే, మెదక్ టౌన్: అనవసరమైన ప్రైవేట్ యాప్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ సంయుక్త సలహాదారు సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రుణ యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సీ-డీఏసీ ప్రాజెక్టు మేనేజర్ జగదీష్ బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి, ట్రాయ్ సీనియర్ రీసెర్చ్ అధికారి వెంకటపతి, వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దాంపత్యానికి 'ఆదర్శం' తోడూనీడ

పూలదండల మార్పిడి, ప్రమాణ స్వీకారంతో వివాహం పూర్తి



నూతన దంపతులు శ్రీకాంత్, స్వేచ్ఛ, పార్టీ, సంఘం నేతలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఆడంబరాలకు దూరంగా యువతి, యువకుడు శుక్రవారం సిద్దిపేటలో ఆదర్శ వివాహం చేసుకున్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యార్థిని స్వేచ్ఛ.. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఆదర్శ వివాహంతో ఒక్కటయ్యారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు పూలదండలు మార్పించి, ప్రమాణ పత్రం చదివించారు. హాజరైన సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి సూర్యం మాట్లాడారు. కుల, మత సంప్రదాయాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను పెంచుతోందన్నారు. వివాహాలను ఆడంబరంగా చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. దానికి భిన్నంగా శ్రీకాంత్-స్వేచ్ఛలు ఆదర్శ వివాహం చేసుకొని సమాజానికి సవాల్ విసిరారన్నారు. యువ జంటను నాయకులు ఆశీర్వదించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

ఆవిర్భావ దినోత్సవం.. పోటెత్తిన భక్తజనం



మెదక్ పట్టణంలో భక్తుల భారీ ర్యాలీ



సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె.రూబెన్ మార్క్, మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య



చర్చి ప్రాంగణంలో శిలువ ఊరేగింపు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: చర్చి ఆఫ్ సౌత్ ఇండియా కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ వేడుకలను శుక్రవారం మెదక్‌లోని సీఎస్ఐ చర్చి ఘనంగా నిర్వహించారు. మెదక్ డయాసిస్ పరిధి ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సంఘాల జెండాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల కోలాటాలు, యువత నృత్యాల మధ్య భారీ ర్యాలీ కొనసాగింది. శిలువను ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించగా, డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా. కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు చేపట్టారు. దైవ సందేశం వినిపించారు. స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావాన్ని పురస్కరించుకొని బిషప్ సతీమణి కె.ప్రిసిల్లా పరిమళ రూబెన్ మార్క్ జ్యోతి వెలిగించారు. భక్తబృందం పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- చర్చి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన భవనంలో సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ఇన్‌ఛార్జి బిషప్.. మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎస్ఐ సంఘం విశ్వసనీయత, విశిష్టతతో కూడుకున్నదని తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు వేడుకలో పాల్గొన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. డయాసిస్ లే సెక్రటరీ ప్రభు కిరణ్, వైస్ ఛైర్మన్ విన్‌స్టన్, విమల్ సుకుమార్, జయానంద్, విల్సన్, సాల్మన్, గంట సంపత్, సాంసన్ సందీప్, స్టువర్ట్ ఫ్రాంక్ జాన్సన్, సువాన్ డగ్లస్, జోయల్, ఉమెన్ ప్రెసిడెంట్ ఎలిజబెత్, సెక్రటరీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనా మందిరంలో భక్తులు

ఐదునెలల్లోనే రూ.28.85 కోట్ల లాభాలు



సిద్దిపేటలో ఉద్యోగినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోలు కేవలం ఐదు నెలల వ్యవధిలో రూ.28.85 కోట్ల లాభాలు ఆర్జించాయని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. రాష్ట్రస్థాయిలో సిద్దిపేట ఆర్టీసీ డిపో లాభాల ఆర్జనలో తృతీయ స్థానం పొందిన నేపథ్యంలో శుక్రవారం సిద్దిపేటలో ఉద్యోగులు, సిబ్బంది అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎం 400 మంది డిపో ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ప్రగతిచక్రం అవార్డు, రూ.2 లక్షల పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే మూడు నెలలు పెళ్లిళ్లు, పండగల సీజన్‌లో మెరుగైన లాభాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి నెలా ఇచ్చే ప్రగతి చక్రం అవార్డులను అందరూ అందుకోవాలని ఆకాంక్షించారు. ఆర్టీసీకి డ్రైవర్లు, కండక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని, ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలగాలని సూచించారు. సర్వీసుల సంఖ్య పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన ముగ్గురికి బహుమతులు అందజేశారు డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, దుబ్బాక ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి కనకలక్ష్మి, సిబ్బంది మౌలానా, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మను వీడని గంగమ్మ..



రాజగోపురంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ



ఆలయం ముందు వరద ప్రవాహం

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నాలుగు రోజులుగా వరద కొనసాగుతోంది. శుక్రవారం వరద మరింత పెరగడంతో అర్చకులు కూడా అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 22,000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ విజయ్ కుమార్ తెలిపారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నా..



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, లేఖ, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాలు.. అనంతపురం జిల్లా కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గతంలో కదిరిలో సీఐగా పని చేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్ వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. ఉదయ్‌కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. మూడేళ్ల కిందట అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించి, కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో అతనిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితోపాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టడంతో వినికిడి కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు.

న్యాయస్థానంలో ఫిర్యాదు: ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయగా పోలీసులపై కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధించారని కుటుంబసభ్యులు తెలిపారు. కేసును వెనక్కి తీసుకోవాలని, తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారని అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడని వాపోయారు. సిద్దిపేట బాలిక దూరమయ్యాక అతడు తెలంగాణలోని భద్రాచలం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారు దూరమయ్యారు. ఈ ఘటనలతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

అనిశాకు చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



షకీల్

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటరు పేరు మార్పిడికి అవసరమయ్యే ధ్రువపత్రం మంజూరు చేసేందుకు రూ.5వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఎండీ షకీల్ అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కాడు. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో చోటుచేసుకుంది. అనిశా డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాలు.. కొండాపూర్‌కు చెందిన మాచేపల్లి అప్సర్ అదే గ్రామానికి చెందిన జి.దశరథ్‌కు చెందిన ఇంటిని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఆ ఇంటికి సంబంధించిన విద్యుత్తు మీటరును తన పేరుపైకి మార్చుకునేందుకు విద్యుత్తు శాఖకు గ్రామ పంచాయతీ నుంచి జారీ చేసిన ధ్రువపత్రం అందజేయాలి. ఇందుకోసం రెండేళ్ల నుంచి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. డబ్బులు ఇవ్వనిదే పని చేయలేమని ఇటీవల పంచాయతీ కార్యదర్శి షకీల్ స్పష్టం చేశాడు. ఇందుకోసం తొలుత రూ.25 వేలు డిమాండ్ చేసిన కార్యదర్శి.. చివరకు రూ.7వేలకు ఒప్పుకొన్నాడు. ఈ విషయంపై అనిశా అధికారులు అప్సర్ సమాచారమిచ్చాడు. కొండాపూర్‌లోని కార్యాలయంలో అప్సర్ నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని అనిశా అధికారులు పట్టుకున్నారు. అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్-1064కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనిశా సీఐలు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో మాయమైన రూ.4.50లక్షలు స్వాధీనం!

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మాయమైన రూ.4.50లక్షల నగదును పోలీసులు వారం రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన మహమ్మద్ రఫీ, రెహనా బేగం దంపతులు ఈనెల 19న మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా షాపుర్‌నగర్ నుంచి కామారెడ్డి డిపోనకు చెందిన బస్సులో ప్రయాణిస్తుండగా.. కౌడిపల్లిలో నగదు ఉన్న సంచి మాయమైంది. దీనిపై స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిఘా కెమెరాలు, ఇతర మార్గాల్లో ఆ రోజు బ్యాగుతో సహా బస్సులో నుంచి దిగిపోయిన మహిళను గుర్తించారు. వారం రోజులు శ్రమించి మహిళను పట్టుకొని.. రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మహిళగా గుర్తించినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డిని వివరణ కోరగా.. నగదు స్వాధీనం చేసుకున్నామని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.


ఢీకొన్న ఇంజినీరింగ్ కళాశాల బస్సులు

- ప్రమాదంలో డ్రైవర్ మృతి • దాదాపు 30మంది విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన రెండు బస్సులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక డ్రైవర్ మృతి చెందాడు. మరో డ్రైవర్‌తో పాటు దాదాపు 30మంది విద్యార్థులు, అధ్యాపకులకు గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు.. విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వెళుతోంది. హైదరాబాద్ నుంచి విద్యార్థులు, అధ్యాపకులతో వస్తున్న మరో బస్సు కళాశాలకు అతి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు వాటిలో ఇరుక్కుపోయారు. విద్యార్థులతో వస్తున్న బస్సులో సుమారు 30 మంది వరకు ఉండగా.. వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల అద్దాలు పగలడంతో ముందు కూర్చున్న విద్యార్థులకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని గాయపడిన వారిని సంగారెడ్డి, నర్సాపూర్ ఆసుపత్రులకు తరలించారు. బస్సుల్లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను అతికష్టం మీద బయటకు తీశారు. డ్రైవర్ నాగరాజు(56)ను నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో డ్రైవర్ యాదగిరిని హైదరాబాద్‌కు తరలించారు. ఉదయం ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. మృతి చెందిన డ్రైవర్ నాగరాజు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రి కాగా.. పటాన్‌చెరులో స్థిరపడ్డారు. మృతుడు నాగరాజు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లింగం చెప్పారు.



నాగరాజు

విద్యార్థుల హాజరు శాతం పెంచండి: డీఈవో

చేర్యాల, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, వారిలో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. కొమురవెల్లి మండలం తపాసుపల్లి, రసూలాబాద్, కొమురవెల్లి పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తపాసుపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన నాణ్యతను పాటించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. రసూలాబాద్ పాఠశాల విద్యార్థుల్లో గణితంలో చతుర్విధ ప్రక్రియలను పరిశీలించారు. కొమురవెల్లి ఇన్‌ఛార్జి ఎంఈవో బి.రమేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వార్డుల్లో పర్యటన.. సిబ్బందికి సూచన

సిద్దిపేట టౌన్: పట్టణంలో బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. మొదట 9వ వార్డులో కౌన్సిలర్ సతీష్‌తో కలిసి వార్డులో పర్యటించారు. పలు కాలనీల్లో సీసీ రహదారి నిర్మించాలని సతీష్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఇమాంబాద్, గాడిచెర్లపల్లి, మచ్చవానికుంట చెరువులను పరిశీలించి పిచ్చిమొక్కలు, చీదు, గుర్రపుడెక్క తొలగించాలని పారిశుద్ధ్య పర్యవేక్షకులను ఆదేశించారు. మైత్రీవనం ఫేజ్-2లో అంతర్గత మురుగునీటి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

యువజనోత్సవాలకు వేళాయె

అక్టోబరు 1 నుంచి ప్రారంభం



నృత్యం చేస్తున్న యువతులు (పాత చిత్రం)

న్యూస్‌టుడే, సిద్దిపేట, గజ్వేల్ గ్రామీణ: యువ కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఏటా యువజనోత్సవాలు నిర్వహిస్తోంది. అక్టోబరు 1 నుంచి పోటీలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో రాణించిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ మొదటి స్థానం పొందిన వారిని జాతీయ స్థాయికి వెళ్తారు. 15 నుంచి 29 ఏళ్ల వయసున్న యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఆసక్తి ఉన్నవారు తమ పేరు, వయస్సు, ఆధార్ కార్డు, చిరునామా, చరవాణి సంఖ్య, ప్రదర్శన పేరు తదితర వివరాలతో జిల్లా కార్యాలయంలో వివరాలు సమర్పించేలా కార్యాచరణ రూపొందించారు.

విభిన్న అంశాల్లో పోటీలు

జిల్లా స్థాయిలో ఫోక్ డ్యాన్స్, సాంగ్(గ్రూప్, సోలో), కవిత్వం, వ్యాసరచన, ఉపన్యాసం(హిందీ, ఇంగ్లిష్), పెయింటింగ్, హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయోత్పత్తులు, సైన్స్ మేళాలలో పోటీలు నిర్వహించనున్నారు. ఆయా పోటీల్లో విజేతలను ఎంపికచేసి మొదటి స్థానం పొందిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతారు.

అర్హులు ఎవరంటే..

గత మూడేళ్లలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న వారు అనర్హులు. ఎవరి సామగ్రిని వారే తెచ్చుకోవాలి. జానపద బృంద నృత్యం, జానపద బృంద పాటలో 10 మంది కంటే ఎక్కువ ఉండరాదు. నృత్యంలో ఐదుగురు, ఫోక్ సాంగ్ సోలోకు ఐదుగురి కంటే ఎక్కువ ఉండకూడదు. జానపద బృంద, ఏక వ్యక్తి నృత్యానికి గరిష్ఠంగా 15 నిమిషాలు, జానపద బృంద, ఏక వ్యక్తి పాటలకు గరిష్ఠంగా ఏడు నిమిషాల సమయం కేటాయిస్తారు.

దరఖాస్తుకు నేడే ఆఖరు రోజు

పోటీల్లో పాల్గొనాలనుకునేవారు శనివారం సాయంత్రం 5 గంటల్లోపు సిద్దిపేటలోని యువజన సర్వీసుల కార్యాలయానికి చెందిన 7780577861 చరవాణి నెంబరుకు వాట్సప్, ఫోన్ చేసి తెలియజేయవచ్చు. కార్యాలయంలో అయినా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా యువజన, క్రీడల అధికారి జయదేవ్ ఆర్య తెలిపారు.

ఉద్యోగ జీవితంలో సేవలే గుర్తుంటాయి



గోపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి తదితరులు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ జీవితంలో చేసిన సేవలే జీవితాంతం గుర్తుంటాయని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు వారి పనితీరుతో సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. గోపాల్‌రెడ్డి విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విఠల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ములుగు: ములుగు మండలం తునికి బొల్లారం పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ఎమ్మెల్సీ జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ఎంఈవో ఉదయభాస్కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన వసతులు: ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

బెజ్జంకి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో విద్యాబోధన సాగేలా కృషి చేస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన రూ.24 లక్షల నిధులతో చేపట్టాల్సిన పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అరకొర గదులతో ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్లంపల్లిలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి భోజనశాల నిర్మాణానికి స్థల పరిశీలన జరిపారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఏఎంసీ ఛైర్మన్ క్రిష్ణ, ఎంపీడీవో ప్రవీణ్, ఎంఈవో మహతిలక్ష్మీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం.. అపరిశుభ్రం



సీజనల్ వ్యాధులపై, పరిసరాల శుభ్రతపై వైద్యసిబ్బంది ప్రజలకు నిత్యం అవగాహన కల్పిస్తున్నా.. వారు మాత్రం పాటించడం లేదు. అక్కన్నపేట మండలం రామవరంలోని ఆరోగ్య ఉపకేంద్రమే ఇందుకు చక్కటి ఉదాహరణ. దీని ఆవరణలో మొత్తం పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అడవిని తలపిస్తున్నాయి. లోపలికి వెళ్లేందుకు కాలిబాట మినహా మిగిలిన ప్రాంతమంతా మొక్కలతో నిండింది. ఇదిలా ఉంటే సింగిల్ ఫేజ్ బోరు వద్ద నీరు నిల్వ వృథా అవుతోంది. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనంలోనూ ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణ :

చిత్రాలు గీసి.. ర్యాలీ తీసి



స్వచ్ఛతపై గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పుర కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు శుక్రవారం చేపట్టిన సైకిల్ ర్యాలీలో స్థానిక జడ్పీ బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత, పర్యావరణం, చెత్త విభజనపై వారు గీసిన చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. పురాధ్యక్షురాలు ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, ప్రధానోపాధ్యాయులు, మెప్మా ఆర్పీలు, జవాన్లు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



బుట్టలతో గిరిజన నాయకులు, మహిళలు

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేటలో గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేకంగా పెంచిన గోధుమ నారు వద్ద తండా పెద్దమనుషులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీజ్(గోధుమనారు)ను ఒకరికొకరు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. తీజ్‌బుట్టలు నెత్తిన పెట్టుకుని సాంప్రదాయ నృత్యాలు చేశారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తిరుపతినాయక్, మంజులారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చరవాణి తస్కరించిన బాలుడి అప్పగింత

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లోని స్థానిక కూరగాయల మార్కెట్లో చరవాణుల చోరీకి పాల్పడిన బాలుడి(11)ని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అంగడిలో ఎక్కువ మంది ఉండడాన్ని ఆసరా చేసుకుని వివిధ ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు చిన్న పిల్లలను తీసుకొచ్చి గత కొంతకాలంగా వారితో చోరీలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం కూరగాయలు విక్రయించే వీధిలో ప్రైవేటు బ్యాంకులో పనిచేసే వ్యక్తి చరవాణిని ఒక బాలుడు తస్కరించాడు. గుర్తించిన స్థానికులు వెంటనే ఆ బాలుడి నుంచి చరవాణి స్వాధీనం చేసుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాసేపటి తర్వాత బాలుడిని తీసుకెళ్లి పోలీసుస్టేషన్‌లో అప్పగించామని కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌ఛార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



లచ్చపేటలో వాలీబాల్ ఆడుతున్న బక్కి వెంకటయ్య

దుబ్బాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. దుబ్బాక మండలంలోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించారు. పురాధ్యక్షురాలు గన్నె వనిత, పుర కమిషనర్ రమేశ్‌కుమార్, ఎంఈవో ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి, సిద్దిపేట అర్బన్: ప్రభుత్వ బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం అక్బరుపేట ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ నెల 29న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్యను షెడ్యూల్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు అధ్యక్షుడు మహంకాళి తెలిపారు.

మొదలైన ఆయిల్‌పామ్ దిగుబడి

ములుగు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సాగు చేయించిన ఆయిల్‌పామ్ తోటల నుంచి ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మర్కూక్ మండలం ఇప్పలగూడెం గ్రామానికి చెందిన రైతు సామల సంజీవరెడ్డి తోటలో సాగుచేసిన ఆయిల్ పామ్ తోటలో పెరిగిన గెలలను మొదటిసారి కోశారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి సూచనలు పాటిస్తూ సాగులో మెలకువలు తీసుకున్నారు. గెలలను నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఉన్న పరిశ్రమకు తరలించినట్లు తెలిపారు. ఆయిల్‌ఫెడ్ అధికారి విజయ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎమ్మెల్సీ



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న యాదవ రెడ్డి

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో రెండు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎంఈవో కృష్ణలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో కొనసాగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. తొలి మూడు స్థానాల్లో వరుసగా ఇలా.. బాలుర విభాగంలో టీజీడబ్ల్యూఆర్ఎస్ (చేర్యాల), ఎంజేపీ(గొల్లపల్లి), ఎంజేపీ(దౌల్తాబాద్), బాలికల విభాగంలో ఎంజేపీ (వర్గల్), ఎంజేపీ (చింతమడక), టీజీఎంఎస్ (గజ్వేల్) జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, ఎస్‌జీపీ కార్యదర్శి సమ్మయ్య, నిర్వాహక సభ్యుడు కనకచంద్రం, ఎన్‌సీసీ అధికారి నగేశ్ అభినందించారు.

మంత్రిపై వ్యాఖ్యలు.. నాయకుడి సస్పెండ్

దుబ్బాక, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దగుండవెల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ చందిరి సంజీవరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు టి.నర్సారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం దుబ్బాకలో జరిగిన సమావేశంలో మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను ఆయనను సస్పెండ్ చేసినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.


భర్త తీసుకెళ్లడం లేదని వివాహిత ఆత్మహత్య



మమత

ములుగు: భర్త తనను తల్లిగారింటి నుంచి తీసుకెళ్లడం లేదన్న మనస్తాపంతో చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్‌కు చెందిన కుకునూరు రమేశ్ కుమార్తె మమత (22)ను నాలుగేళ్ల క్రితం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రావల్‌కోల్‌కు చెందిన తరిగొప్పుల ఆంజనేయులు కుమారుడు నర్సింలుతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. ఏడాది క్రితం నర్సింలు, మమత మధ్య గొడవలు జరగ్గా, ఆమె తల్లిగారింటికి వచ్చేసింది. అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో వంట పనులు చేస్తోంది. ఈనెల 24న కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. 25న తండ్రి ఠాణాలో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. శుక్రవారం ములుగు మండలం జప్తిసింగాయపల్లి గ్రామ చెరువులో మమత విగతజీవిగా తేలింది. పోలీసులు పరిశీలించి మృతదేహం వెలికితీశారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



రామచంద్రారెడ్డి

నంగునూరు: విద్యుత్తు తీగలను పరిశీలిస్తున్న క్రమంలో కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్‌లో చోటుచేసుకుంది. రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాలు.. కరెడ్ల రామచంద్రారెడ్డి (59) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పొలానికి నీరు పెట్టేందుకు శుక్రవారం ఉదయం వెళ్లాడు. బోరు మోటారుకు విద్యుత్తు సరఫరా కాకపోవడంతో తీగలు పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు మధ్యాహ్నం వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. భార్య నాగవ్వ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ధరల పెరుగుదలపై రాస్తారోకో

హుస్నాబాద్, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరల పెరుగుదలను నిరసిస్తూ హుస్నాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. రాష్ట్రంలో నిల్వలు ఉన్నప్పటికీ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సంజీవరెడ్డి, బాలయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోం: కాంగ్రెస్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రాజీనామా అంశాన్ని పక్కదోవ పట్టించడానికే ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతు రుణమాఫీ పేరిట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపీకృష్ణ ఆరోపించారు. సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత భారాస పాలనతో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



హుస్నాబాద్‌లో పాల్గొన్న పుర, సహకార సంఘాల ఛైర్మన్లు, వివిధ సంఘాల నాయకులు



గజ్వేల్: బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, పద్మశాలి సంఘం ప్రతినిధులు

గజ్వేల్ గ్రామీణ, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, న్యూస్‌టుడే: స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జిల్లాలో శుక్రవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గజ్వేల్‌లో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి, పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజారామ్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో, బాలుర విద్యసౌధం ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. దుబ్బాక పద్మశాలి భవన్‌లో సంఘం అధ్యక్షుడు జిందం గాలయ్య ఆధ్వర్యంలో, హుస్నాబాద్ పట్టణంలో పద్మశాలి సంఘం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద, పురపాలికలో నివాళులర్పించారు. పురాధ్యక్షురాలు ఆకుల రజిత, సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ మల్లికార్జున్, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. చేర్యాలలోని బల్దియా కార్యాలయంలో పురాధ్యక్షురాలు స్వరూపారాణి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తదితరులు బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి: డీపీవో

కొండపాక గ్రామీణం: ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో దేవకిదేవి అన్నారు. శుక్రవారం కొండపాక మండలం దుద్దెడలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని గ్రామస్థులకు సూచించారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. వీధులు, మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్యరూపకం ద్వారా తోటి విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు శుక్రవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రూ.25,000 జరిమానా విధించారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

వర్గల్, న్యూస్‌టుడే: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించిన ఘటన గౌరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాలు.. వర్గల్ మండలం అంబర్‌పేటకు చెందిన వల్లపు రాజు(29) ఆగస్టులో అదే గ్రామంలో వరుస దొంగతనాలు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆగస్టు 30న అతడిని అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు. కేసు వివరాలు పరిశీలించిన గజ్వేల్ అదనపు శ్రేణి న్యాయమూర్తి బి.ప్రియాంక రూ.4 వేలతో జరిమానాతో పాటు రాజుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేసు విచారణలో పాల్గొన్న ఎస్సై కరుణాకర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలను ఉన్నతాధికారులు అభినందించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై కార్యశాల



కొండపాకలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళా రక్షణ చట్టాలపై కొండపాకలోని గురుకుల బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులకు ర్యాగింగ్, పోక్సో, షీ-టీమ్స్, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కుకునూరుపల్లి ఏఎస్ఐ శంకర్, గజ్వేల్ షీ-టీమ్ బృందం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ గ్రామీణం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని కట్కూర్‌లో నిర్వహించిన 'కనువిప్పు' కార్యక్రమం నిర్వహించారు.

గజ్వేల్ గ్రామీణ: డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాలపై శుక్రవారం గజ్వేల్ బాలికల విద్యాసౌధం ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం, ఆర్బీఐ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్ రాధికాభరత్, వైస్ ప్రిన్సిపల్ శ్రీలత, అధ్యాపకులున్నారు.

ఇళ్ల జాబితాలో అనర్హులను తొలగించండి

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ పట్టణంలో రెండు పడక గదుల ఇళ్ల జాబితాలో అనర్హులను తొలగించేలా మరోసారి సమగ్ర సర్వే జరిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సమీకృత కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించి ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. మళ్లీ సర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఈనెల 30న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేట టౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకటస్వామి గౌడ్ తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 8501977079, 96660 20322 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలేవీ: భారాస

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ నాయకులను ఆహ్వానిస్తూ ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని దుబ్బాక మాజీ జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం, పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం కల్పించిన జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి ప్రొటోకాల్ ఉల్లంఘించారని ఆరోపించారు. భారాస నాయకులు రాంరెడ్డి, పాల సాయిరాం, మోహన్‌లాల్, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో మత్స్యకారులపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్, యువత రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్‌ముదిరాజ్, భారాసవి జిల్లా అధ్యక్షుడు రెడ్డియాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు ఇప్పటికీ చేప పిల్లలు పంపిణీ చేయకపోవటం ఏంటని ప్రశ్నించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు.